క్లుప్తంగా

సేంద్రియ వ్యర్థాలతో వర్మి కంపోస్ట్



రుద్రూర్: సేంద్రియ వ్యర్థాలు ఉపయోగించి వర్మి కంపోస్ట్ తయారు చేయవచ్చని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త పి. విజయ్ కుమార్ అన్నారు. వర్మి కంపోస్ట్ తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులుగా రైతులకు అగ్రికల్చర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం శిక్షణతో పాటు కేవీకేలోని వర్మి కంపోస్ట్ యూనిట్ వద్ద క్షేత్ర స్థాయిలో ఎలా తయారు చేయాలో రైతులతో ప్రయోగం చేయించారు. ఈ విధానంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్లేస్మెంట్ కో–ఆర్డినేటర్ శ్రీధర్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుకు వినతి

నవీపేట: మండలంలోని నందిగామలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ జన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు డి. సంజీవ్ బీఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రం అందజేశారు. నందిగామలో సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో ఆన్‌లైన్ ప్రక్రియలో అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ సరకుల సరఫరా, ఉపాధి హామీ కూలీలతో పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకమహాలక్ష్మి అన్నారు. పట్టణంలోని కళాశాలకు సంబంధించిన కరపత్రాలను ప్రిన్సిపాల్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలని విద్యార్థులను కోరారు. కళాశాలల్లో అందిస్తున్న విద్యాబోధన, సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవారాం, పీడీ గంగాధర్, అధ్యాపకులు స్రవంతి, రాజకళ పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీ కమాన్ ప్రారంభం



ఆర్మూరటౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న హనుమాన్ దేవాలయంలో వీర హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే టీచర్స్ కాలనీ సభ్యులు కలిసి నిర్మించిన టీచర్స్ కాలనీ కమాన్‌ను శనివారం సీనియర్ సిటిజన్స్ ప్రారంభించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జితేందర్ రెడ్డి, రంగాచారి, సురేందర్ రెడ్డి, కాలనీ కమిటీ సభ్యులు బిజ్జు దత్తాద్రి, కొంతం మురళీధర్, ధనుంజయ రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



ఆర్మూర్‌టౌన్: వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డి అన్నారు. పెర్కిట్‌లోని ఎంవీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. పోలీస్, ఆర్‌టీఏ శాఖల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్ ఉండాలని, మద్యం సేవించి, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల యజమానులు తమ పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకోవాలని, లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్

ఖలీల్‌వాడి: ఎంపీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ప్రజలు గుంపులుగా ఉండొద్దని సీపీ కల్మేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. డిచ్‌పల్లి మండలంలోని సీఎంసీ కళాశాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో ఎవరూ ఉండొద్దని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు

- ఆదర్శంగా నిలుస్తున్న యువరైతు
- నూతన విధానానికి శ్రీకారం



సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న ఆకుకూరలు

నందిపేట్: రసాయనిక ఎరువులతో పండిన పంటలతో ప్రజలకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో సేంద్రియ పద్ధతిలో సహజసిద్ధంగా కూరగాయలు సాగు చేసి అందరికీ ఆరోగ్యాన్ని పంచాలనే ఉద్దేశంతో ఓ యువ రైతు ముందుకొచ్చాడు. మండలంలోని ఉమ్మెడ గ్రామానికి చెందిన గాజుల గంగారెడ్డి తనకున్న నాలుగు ఎకరాల్లో ఓ ఎకరంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్నాడు. జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చాడు. ప్రకృతి వనరులను ఉపయోగించి వ్యవసాయం ద్వారా గుర్తింపు సొంతం చేసుకోవాలనే ఆలోచనతో కూరగాయల సాగును ఎంచుకున్నాడు. ముఖ్యంగా టమాట, బెండ, వంకాయ, బీర, పాలకూర, పొనుగంటి కూర, గంగవాయిల కూర, మెంతికూర, కొత్తిమీర లాంటివి సాగు చేస్తున్నాడు.

గోఆధారిత వ్యవసాయ పద్ధతిలో..

గంగారెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో గోవులను పెంచుకుంటున్నాడు. ఎలాంటి రసాయనిక మందులను ఉపయోగించకుండా కేవలం గోఆధారిత వ్యవసాయ పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నాడు. భూమిలో సారం పెంచేందుకు సూక్ష్మ జీవుల పెంపకం కోసం గోవు మూత్రంతో జీవామృతాన్ని తయారు చేస్తున్నాడు. మొక్కలకు పోషణ అందించడానికి ఆవుపేడ, బెల్లం, పిండిలను కలిపి గణజీవామృతం తయారు చేసి వర్మి కంపోస్టులాగ ఉపయోగిస్తున్నాడు. మొక్కలకు దోమపోటు రాకుండా వేపాకు, గోమూత్రంతో నీమాస్త్రం తయారు చేసి వాడుతున్నాడు. పురుగులు సోకకుండా మిర్చి, వెల్లుల్లి, వేపాకు, గోమూత్రం, పొగాకులను కలిపి ఉడకబెట్టి, వడకట్టి అగ్నాస్త్రాన్ని తయారు చేసి మొక్కలకు పిచికారీ చేస్తున్నాడు. పంటలను నష్టపరిచే పురుగుల లార్వాలను నాశం చేయడానికి, మొక్కల ఎదుగుదలకు పుల్లటి మజ్జిగ, గోమూత్రంతో ద్రవణం తయారు చేసి పిచికారీ చేయాలని తెలిపాడు. బిందు సేద్యంతో నీటి తడులను అందిస్తూ సాగు చేస్తున్నాడు.

పంట వద్దే అమ్మకాలు

సేంద్రియ కూరగాయలు సాగు చేసే పంట వద్దకు వచ్చి వినియోగదారులు కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రానికి చెందిన పలువురు ఫోన్లో ఆర్డరు చేసి కూరగాయలను తీసుకుంటున్నారు. అందరిలా కాకుండా వినూత్న పద్ధతిలో ఆలోచించి సాగు పద్ధతులను అవలంభించి వ్యవసాయం సాగు చేస్తున్నాడు.

> **మంచి కూరగాయలు అందించాలనే..**
>
> 
>
> ఎరువులు, పురుగుల మందులు వాడి విషపూరితమైన కూరగాయల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్నాను. స్థానికులతో పాటు జిల్లా కేంద్ర ప్రజలు కూరగాయలను తీసుకుంటున్నారు. ప్రజల వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని మరిన్ని పంటలు సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.
>
> – గాజుల గంగారెడ్డి, ఉమ్మెడ, నందిపేట

కౌంటింగ్ విధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్



మాట్లాడుతున్న ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్

బోధన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4న నిర్వహించే ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు చోటు ఇవ్వకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసులో బోధన్ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులకు కౌంటింగ్ ప్రక్రియపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. డిచ్‌పల్లి మండలంలోని సీఎంసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో జరుగుతుందని, ఓట్ల కౌంటింగ్ నియోజక వర్గానికి సంబంధించి 18 రౌండ్లల్లో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. తహసీల్దార్ గంగాధర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన నారుమడికి..

రుద్రూర్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. సాధారణ పద్ధతిలో సాగు చేసే వరి దాదాపు నెలరోజులు నారుమడి దశలో ఉంటుంది. ఈ దశలో కొన్ని మెలకువలు పాటిస్తే ఆరోగ్యవంతమైన నారు పెరిగి, ప్రధాన పొలంలో సమస్యలు తక్కువగా ఉండడానికి ఆస్కారముంటుందని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత(ప్లాంట్ బ్రీడింగ్) సౌందర్య అన్నారు.

శాస్త్రవేత్త మాటల్లోనే..

అందుబాటులో ఉన్న నీటి వసతి, ప్రాంతాన్ని బట్టి చీడపీడలను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎన్నుకున్న రకం కాల పరిమితి బట్టి నిర్ణీత సమయంలో నార్లు పోసుకోవాలి. జూన్ 20 వరకు దీర్ఘకాలిక రకాలు, జూలై 5వరకు మధ్యకాలిక రకాలు, జూలై 30 వరకు స్వల్పకాలిక రకాలు, ఆగస్టు మొదటి వారం వరకు అతి స్వల్పకాలిక రకాలు పోయవచ్చు. విత్తే పది రోజుల ముందుగానే నారు పెంచే పొలానికి బాగా దున్ని కలుపు లేకుండా చేసి చదును చేయాలి.

నాటు పద్ధతిలో ఎకరం వరి సాగుకు 20 కిలోలు (సన్నరకాలు), 25 కిలోలు (దొడ్డు రకాలు) విత్తనం సరిపోతుంది. విత్తన మొలక శాతం ముందుగా పరీక్షించుకుని నారు పోయాలి. ఎంచుకున్న విత్తనానికి తప్పని సరిగా విత్తనశుద్ధి చేయాలి. దీనికి లీటరు నీటికి ఒక గ్రా. కార్బండాజిమ్ కలిసిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండెకట్టి మొలక వచ్చిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లాలి. 5 సెంట్లు నారుమడికి ఒక కిలో నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌ని ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. మరో కిలో నత్రజని ఇచ్చే ఎరువును విత్తిన 12–14 రోజుల్లో వేయాలి. నారుకు మొదటి వారం రోజులు అంటే ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు ఆరుతడులు ఇచ్చి ఆ తర్వాత మొక్కదశలో పలుచగా సుమారు 2–3 సెం.మీ నీరు ఉంచాలి.

నారు మడిలో కలుపు నివారణకు..



సౌందర్య, శాస్త్రవేత్త

నారుమడిలో కలుపు నివారణకు బ్యూటాక్లోర్ 5 మి.లీ లేదా ప్రెటిలాక్లోర్ + సేఫ్‌నర్ 2 మి.లీ ఎకరాకు సరిపడా నారుమడికి ఐదు లీటర్ల నీటిలో కలిపి విత్తిన 8–10 రోజులకు పిచికారీ చేయాలి. నారుమడిలో ఊద, బడిపిలి వంటి గడ్డిజాతి కలుపు ఉంటే విత్తిన 15 రోజులకు సైహలోఫాఫ్ – పి.బ్యుటైల్ 1.5 మి.లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి. నారుమడి చుట్టూ గట్లు మీద చీడపీడలకు ఆశ్రయమిచ్చే తుంగ, చిప్పెర, గరిక, ఊద లాంటి కలుపు మొక్కలు లేకుండా చూడాలి. నారుమడిలో జింకు లోపాన్ని గమనిస్తే సవరించడానికి 2గ్రా. జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు తీయడానికి వారం రోజుల ముందు 5 సెంట్లు నారుమడికి పలుచగా నీరు ఉంచి 800గ్రా. కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు ఇసుకలో కలిపి చల్లి ఆ మడిలోనే ఇంకేట్లు చేయాలి.

ఇలా చేస్తే నాట్లు వేశాక 15–20 రోజుల వరకు కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు నుంచి పంట సంరక్షింపబడుతుంది.

చౌడు పొలాల్లో నారు పెంచితే నారు పెరిగే సమయంలో బాగా చితికిన పశువుల ఎరువునుగాని, వర్మి కంపోస్ట్‌ను గాని నారుమడిలో పలుచగా ఒక పొరలాగా చల్లుకోవాలి. అంతేగాకుండా నారుమడిలో ఎల్లప్పుడు పలుచగా నీరు పెడుతూ తీసివేస్తూ ఉండాలి. 4–6 ఆకులున్న నారును నాటుకోవడానికి ఉపయోగించాలి. నారు కొనలను త్రుంచి నాటుకోవాలని సూచించారు. ఈ సూచనలను నారుమడిలో పాటిస్తే ఆరోగ్యవంతమైన నారును పొంది సకాలంలో నాట్లు వేసుకొని అధిక దిగుబడులను సాధించవచ్చని వివరించారు.

అంతర్జాతీయ క్రీడాకారిణికి నగదు పురస్కారం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారిణి తమ్మనే మౌనికను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం ఘనంగా సన్మానించి రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ధర్పల్లి మండలానికి చెందిన మౌనిక ఇటీవల శ్రీలంక దేశంలో నిర్వహించిన అండర్ –20 ఇంటర్నేషనల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే, సౌత్ కొరియాలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ టోర్నీకి మౌనిక ఎంపికైంది. భారత టెన్నిస్ బాల్ క్రికెట్ టీమ్‌కు తెలంగాణ నుంచి ఎంపికైన తొలి క్రీడాకారిణి మౌనిక కావడం విశేషం. కోచ్ లతీఫుద్దీన్‌తో కలిసి బర్దిపూర్ శివారులోని హోటల్ కృష్ణలో మంత్రి కోమటిరెడ్డిని మౌనిక మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి ఆమెను సన్మానించి నగదును అందజేశారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నాయకుడు మనోహర్‌రెడ్డి, డిచ్‌పల్లి సొసైటీ అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. వేడుకలకు అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

వేడుకలను ఘనంగా నిర్వహించాలి



మోర్తాడ్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ సూచించారు. ఏర్గట్ల మండల కేంద్రంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రేండ్ల రాజారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

కొవ్వొత్తుల ర్యాలీ



నందిపేట్: మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల దశాబ్దాల కల అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులకు జోహార్లు అర్పించారు. అమరవీరుల సంస్మరణార్థం నందిపేట్ మండల కేంద్రంలో జుమ్మా మసీద్ నుంచి అంబేద్కర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల సాగర్, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్, నాయకులు బొడ్డు రాజశేఖర్, బాలగంగాధర్, భరత్, హుస్నొద్దీన్, సుభాష్, పాష, సాయిలు పాల్గొన్నారు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం

ఎడపల్లి: మంచి ఆహారంతోనే ఆరోగ్యం బాగుంటుందని యునైటెడ్ నేషనల్ డెవలప్‌మెంట్ ఫోరమ్ ఎండీ డాక్టర్ రాజారత్నం అన్నారు. ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా మండలంలోని జైతాపూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. వైద్యులు సైతం ప్రజలకు పాల గురించి అవగాహన కల్పిస్తే బాగుంటుందని అన్నారు. అనంతరం ఆయనను గ్రామస్తులు, రైతులు సన్మానించారు. కార్యక్రమంలో యూఎన్‌డీపీ కో–ఆర్డినేటర్ రైతు పాపారావు, సభ్యులు వివేకానంద రెడ్డి, రైతులు జనార్దన్‌రెడ్డి, మదన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్‌లోని ఉన్నత పాఠశాల 2001–2002కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి మిత్రులు అందరూ ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను సన్మానించారు. సమ్మేళనంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన



దూపల్లిలో పనులను పరిశీలిస్తున్న అధికారులు



ఆర్మూర్‌లో మున్సిపల్ కమిషనర్ రాజు



ముల్లంగి (బి)లో డీఈవో దుర్గాప్రసాద్

మాక్లూర్/ రెంజల్/ ఆర్మూర్‌టౌన్: మాక్లూర్ మండలంలోని ముల్లంగి (బి), బొంకన్‌పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను డీఈవో దుర్గాప్రసాద్ శనివారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి బడులను అందుబాటులోకి తేవాలని పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. డీఈవో వెంట అమ్మబడి పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు. రెంజల్ మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను అధికారులు పరిశీలించారు. మండలంలోని దూపల్లి, సాటాపూర్, వీరన్నగుట్ట, కళ్యాపూర్ గ్రామాల్లోని పాఠశాలలను పంచాయతీరాజ్ ఏఈతో కలిసి ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పనులను పర్యవేక్షించాలని సూచించారు. వారి వెంట పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయరెడ్డి, దూపల్లి మాజీ సర్పంచ్ బాబు ఉన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని తొమ్మిది అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ రఘు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి



బోధన్‌లో మాట్లాడుతున్న నాయకులు

బోధన్: వైద్యం కోసం వెళ్లిన మహిళల అసభ్యకర ఫొటోలు, వీడియోలు చిత్రీకరించిన జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసిన సదరు స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల చర్యలు మానవత్వాన్ని మంటగలిపే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా స్కానింగ్ సెంటర్లు రోగులను నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. నాయకులు పడాల శంకర్, లక్ష్మణ్, పోశెట్టి, మోహన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య

బోధన్: రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య ఆదేశాల మేరకు శనివారం పట్టణ కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులకు కొత్త చట్టాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతుల్లో భారతీయ న్యాయ సంహిత చట్టం, భారతీయ సురక్ష సంహిత చట్టం, భారతీయ సాక్ష్యం అధి నియం న్యాయం–2023 కొత్త చట్టాలను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డాక్టర్ సమ్మయ్య, శ్యాంరావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి వివరించారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే పోలీస్, అటవీ, ఎక్సైజ్ శాఖల అధికారులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల ఆయా శాఖల సీఐలు, ఎస్సైలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



సాలూరలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



పోచంపల్లిలో..

బోధన్/ వర్ని(మోస్రా)/ రుద్రూర్/ వేల్పూర్: సాలూర మండలంలోని సాలూర క్యాంప్‌లో ఉన్న హనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకులను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం, అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మోస్రా మండల కేంద్రంలోని సీతారామ ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. రుద్రూర్ మండల కేంద్రంలోని హన్మాన్ ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేల్పూర్ మండలంలోని పోచంపల్లిలో ఉన్న హనుమాన్ ఆలయంలో భక్తులు హోమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.



మోస్రా సీతారామ ఆలయంలో పూజలు..

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	లవ్‌మీ (తెలుగు) – 12.05, 6.15 ఫ్యూరియోసా (తెలుగు) – 3.00 హిట్‌లిస్ట్ (తెలుగు) – 9.10
స్క్రీన్-2 –	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) – 10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3 –	గంగం గణేశా (తెలుగు) – 12.15, 3.20, 6.25, 9.30
స్క్రీన్-4 –	భజే వాయువేగం – 10.35, 1.30, 4.25, 7.20, 10.15